


హాల్ టికెట్స్ లేక 9 మంది పరీక్షలకు దూరం

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: ఓ కళాశాల నిర్లక్ష్యంతో 9 మంది ఇంటర్ విద్యార్థులు హాల్ టికెట్లు లేక పరీక్షలు రాయలేకపోయారు. దీంతో విద్యార్థిలు, వారి తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. చిత్తూరు జిల్లా పెనుమూరుకు చెందిన ఎస్వీ జూనియర్ ప్రైవేట్ కళాశాలను ఓం ప్రకాష్ కొనుగోలు చేసి అనుమతి లేకుండా తిరుపతి బైరాగిపట్టెడలో కళాశాల ఏర్పాటు చేశారు. ఫిర్యాదు రావడంతో ఇంటర్మీడియట్ అధికారులు అతనికి నోటీసులిచ్చారు. తాజాగా ఇంటర్ పరీక్షలు రాసేందుకు 86 మంది విద్యార్థులను పెనుమూరు ఎస్వీ జూనియర్ కళాశాల పేరుతోనే చిత్తూరులో పరీక్ష కేంద్రాలకు పంపగా అందులో 9 మందికి హాల్ టికెట్లు లేకపోవడంతో పరీక్షలు అనుమతించలేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు కళాశాల వద్ద ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని కళాశాల యాజమాన్యంతో మాట్లాడారు. కళాశాల సిబ్బంది తప్పిదంవల్ల విద్యార్థులకు హాల్ టికెట్లు మంజూరు రాలేదని, జూన్లో జరిగే పరీక్షల్లో ప్రత్యేకంగా ఆ తొమ్మిది మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తామని, ఇబ్బంది ఉండదని కళాశాల యజమాని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఆప్కాస్‌లో కొనసాగించండి

- ఏజెన్సీలో చేర్చొద్దు
- ఆందోళనలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు



ప్రజాశక్త - తిరుపతి టౌన్: ప్రభుత్వం అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులపై సవతి ప్రేమ ప్రదర్శిస్తోంది. ఎన్నికలకు ముందు ప్రతిపక్షంలోని టిడిపి, జనసేన పార్టీలు కార్మికులకు హామీలు కురిపించాయి. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేస్తామని, పర్మినెంట్ చేస్తామని ఇలా అనేక హామీలు ఇచ్చాయి. కానీ వాటిని అమలు చేయకపోగా ఏకంగా ఆప్కాస్‌ను రద్దు చేసి, ఏజెన్సీకి ఇవ్వాలని టిడిపి కూటమి ప్రభుత్వం పూనుకుంది. రాష్ట్రప్రభుత్వం అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికుల పేరుతో వెట్టిచాకిరీ చేయించుకుంటూ అతితక్కువ జీతాలు ఇస్తోంది. తమను పర్మినెంట్ వేయాలని ఎన్నో ఏళ్లుగా వారంతా ఆందోళన నిర్వహిస్తున్నారు. డిగ్రీలు, పీజీలు పూర్తి చేసి, కుటుంబ అవసరాల కోసం కష్టపడి పనిచేస్తున్నారు. వైసిపి ప్రభుత్వంలో ఆప్కాస్ పేరుతో కార్పొరేషన్ ఏర్పాటు వేసింది. తాజాగా టిడిపి కూటమి ప్రభుత్వం కార్పొరేషన్‌ను తొలగించి పాత పద్ధతిలోనే ఏజెన్సీల ద్వారా వేతనాలు ఇవ్వడానికి సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ప్రభుత్వ నిర్ణయంతో ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు పరిస్థితుల కనిపిస్తున్నాయి. ప్రభుత్వం కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా, ఖాళీ అయిన ఉద్యోగాలు భర్తీ చేయడం లేదు. ఈ పనిని అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులతో చేయిస్తున్నారు. మున్సిపాలిటీల్లో అయితే పారిశుధ్య కార్మికులు తెల్లవారు జాము నుంచి రాత్రి పొద్దుపోయే వరకు పనులు చేస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఆప్కాస్ పరిధిలో సుమారు వివిధ ప్రభుత్వ విభాగంలో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ పద్ధతిలో 12 వేల మంది కార్మికులు ఉన్నారు. తిరుపతి జిల్లాలో 6 వేల మంది పైగా ఉన్నట్లు సమాచారం. వీరితో పాటు టీటీడీలో పనిచేస్తున్న వారిని కొదరిని కూడా ఆప్కాస్‌లో చేర్చడం జరిగింది. తమను ఆప్కాస్‌లో కొనసాగించాలని జిల్లావ్యాప్తంగా కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులు కోరుతూ ఉంటే ప్రభుత్వం వాటికి విరుద్ధంగా వ్యవహరించేందుకు సిద్ధమవుతోందని కార్మికులు ఆందోళన చెందుతున్నారు.

గతంలో ఇలా..

గతంలో ఈ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ప్రవేటు ఏజెన్సీల ద్వారా నిర్వహించే వారు. జీతాలు వారికి ఇస్తే, వారు కార్మికులకు చెల్లించే పరిస్థితులుండేవి. ఇందుకోసం జీతంలో ఒక్క శాతం ఏజెన్సీ తీసుకునేది. కార్మికులు ఇఎస్ఐ, పిఎఫ్, జిఎస్టిటిలు ఏజెన్సీలు చెల్లించాలి. కానీ వారు చెల్లించకుండా కార్మికులను దోపిడీ చేశాయి. వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక, ఆప్కాస్ కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. ఏజెన్సీలను తొలగించి అందరినీ దీనిలోకి మార్చి నాలుగు క్లాసుల కింద జీతాలు చెల్లించేవారు.

ఆప్కాస్ రద్దు ఉపసంహరించుకోవాలి

ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం ఆప్కాస్ రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నట్లు ప్రకటించాలి. ఆప్కాస్ ఏర్పడి ఇప్పుడిపుడే వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ వంటి పడుతున్నాయి. ఏజెన్సీలకు ఇవ్వడం ద్వారా సకాలంలో వేతనాలు అందవు. ఎజెన్సీలపై ఆధారపడాల్సి వస్తుంది. ప్రభుత్వం వెంటనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులు జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు చేయాల్సి వస్తుంది.



- ఎస్కే కరీముల్లా, ఏపీ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు

ప్రతి నెల ఒకటో తేదీ జీతం

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు ఆప్కాస్ ద్వారా ప్రతి నెల ఒకటో తేదీ జీతం ఇస్తున్నారని ఏజెన్సీలకు ఇవ్వడం వల్ల మూడవ పార్టీకి కమిషన్లు పోతాయి. జీతాలు సక్రమంగా ఇవ్వరు.ప్రభుత్వం ఆప్కాస్‌ను కొనసాగించాలి. సీఎం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలి. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికుల నమ్మకాన్ని నిలుపుకోవాలి.



- గండికోట నాగ వెంకటేష్, జేపీసీ చైర్మన్, కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ అండ్ ఎంప్లాయిస్, టీచర్స్ అండ్ వర్కర్స్ జేపీసీ తిరుపతి జిల్లా

ఈఎస్ఐ, పిఎఫ్ భద్రత

ఆప్కాస్‌తో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు ఈఎస్ఐ, పిఎఫ్ భద్రత ఉంటుంది. గతంలో ఏజెన్సీలు ఈఎస్ఐ, పిఎఫ్ డబ్బులు కార్మికుల ఖాతాలో జమ చేయకుండా స్వాహా చేసిన సందర్భాలు ఉన్నాయి. ఏజెన్సీలకు అప్పజెప్పడం వల్ల కార్మికులతో వెట్టి చాకిరి చేయించి, ఏజెన్సీలు లబ్ధి పొందుతాయి.



- చిన్న బాబు, ఆప్కాస్ రాష్ట్ర అధ్యక్షులు

చెరువులు, కాలువలు ఆక్రమిస్తే ఉపేక్షించొద్దు



నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య

ప్రజాశక్త - తిరుపతి టౌన్: నగరపాలక సంస్థ పరిధిలో ఎవరైనా చెరువులు, కాలువలను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే ఉపేక్షించవద్దని నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని పాన్ చెరువు, గణేష్ లేఔట్, సాయి విష్ణు లేఔట్, జన చైతన్య లేఔట్, అన్నమయ్య మార్గం రోడ్డు తదితర ప్రాంతాలను డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ, హెల్త్, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ముఖ్యంగా పాన్ చెరువులో అనధికార నిర్మాణాలు చేస్తున్నారని, పలు లే ఔట్లలో కాలువలు ఆక్రమించినట్లు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో పిర్యాదులు వస్తున్నాయన్నారు. నగరంలోని చెరువులు, కుంటలు, కాలువలు ఆక్రమించి నిర్మాణాలు చేస్తే కఠినచర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఈ ప్రాంతాల్లో భవన నిర్మాణ వ్యర్థాలు వేస్తున్నారని వారిని గుర్తించి జరిమానా విధించాలన్నారు. నగరంలో డ్రెయినేజీ కాలువలపై అక్రమ నిర్మాణాలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతిరోజూ ఇంటింటికీ చెత్త సేకరణ వాహనం వెళ్లేలా చూడాలని హెల్త్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ అమరయ్య , సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, తుడా ఎస్.ఈ .కృష్ణారెడ్డి, ఈ.ఈ. రవీంద్ర, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారి సేతు మాధవ్, డిసిపి మహాపాత్ర, ఏసిపిలు బాలాజీ, మూర్తి , డి.ఈ.రమణ, సర్వేయర్ కోటేశ్వర రావు, శానిటరీ సూపర్ వైజర్ సుమతి తదితరులు ఉన్నారు.


బదిలీల చట్టంలోని అసంబద్ధాలను తొలగించాలి : ఎస్టియు



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం తిరుపతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో, తిరుపతి ఎస్టీయుభవన్‌లో బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ముసాయిదా చట్టంలోని అంశాలను పరిశీలించి అభిప్రాయాలను కోరిన నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ముసాయిదా చట్టంలోని అసంబద్దాలను తొలగించి అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని సమగ్రచట్టాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్టియు రాష్ట్ర నేత గాజుల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీల్లో రాజకీయ జోక్యం లేకుండా చూడాలన్నారు. పోరాటాలు చేసి కౌన్సిలింగ్ విధానం మొదటగా టీచర్లకు మాత్రమే అమలు చేసుకున్నామన్నారు. ప్రతియేట కౌన్సిలింగ్ నిర్వహణలో జాప్యం జరుగుతూ బోధనకు ఆటంకం కలుగుతోందన్నారు.జిల్లా అధ్యక్షులు రమేష్ బాబు మాట్లాడుతూ ఏ ఉపాధ్యాయుడు నష్టపోకుండా సీనియారిటీ, స్టేషన్, ప్రిఫరెన్షియల్ కేటగిరీలకు సంబం ధించి అందరికీ న్యాయం జరిగేలా అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. 117 జీవో రద్దు పేరుతో పాఠశాలలను రద్దు చేయడం తగదన్నారు. తల్లికి వందనం పేరుతో 15 వేల రూపాయలను ప్రభుత్వ బడుల్లో చదివించే తల్లిదండ్రులకు పరిమితి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ జగన్నాథం, జిల్లా మహిళకన్వీనర్ రేణుకాదేవి, రాష్ట్ర కౌన్సిలర్ రామాంజనేయులు, డివిజన్ కన్వీనర్స్ వాసు, సురేష్ జిల్లా నాయకులు దేవేంద్ర, శ్రీనివాసులు సురేష్, మురళీకృష్ణ, మహేష్‌లు పాల్గొన్నారు.

పేదలకు 'కరెంట్' షాక్

- పేదలపై విద్యుత్ చౌర్యం కేసులు
- జరిమానా కట్టకుంటే.. కోర్టుకీడుస్తామంటూ బెదిరింపులు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : కూటమి ప్రభుత్వం పేదల పట్ల సవతి ప్రేమను చూపుతోంది. ఒక వైపు సంక్షేమ పథకాలు ఇస్తున్నామంటూనే.. మరో వైపు పేదల నుంచి అందినకాడికి గుంజే ప్రయత్నం చేస్తోంది. తాము అధికారంలోకి వస్తే తెల్ల రేషన్ కార్డు కల్గిన ప్రతి నిరుపేద ఇంటికి 250 యూనిట్లు విద్యుత్ ఉచితమంటూ హామీలు గుప్పించింది. తీరా అధికారంలోకి వచ్చాక ఉచితం మాట అంటుంచి మీటర్లు లేని పేదల ఇళ్లపై విజిలెన్స్ దాడులు చేయించి, విద్యుత్ చౌర్యం పేరిట అక్రమ కేసులు బనాయిస్తోంది. విజిలెన్స్ విభాగం పోలీసులను గిరిజన కాలనీలు, దళితవాడలకు పంపి జరిమానా కడతారా..? లేకుంటే కోర్టు బోనులో నిలబడతారా..? అంటూ బెదిరింపులు దిగుతోంది. ఈ తరహా బెదిరింపుల నేపథ్యంలో తొట్టంబేడు మండలంలోని బోనుపల్లి దళితవాడ ప్రజలు విద్యుత్ విజిలెన్స్ విభాగం పోలీసులతో బుధవారం వాగ్వాదానికి దిగారు. నోటీసులు ఇవ్వకుండా కేసులు ఎలా పెడతారనీ, జరిమానా ఎలా విధిస్తారనీ, మరి ఇన్నాళ్ళూ నిద్రపోయారా...? అంటూ నిలదీశారు.

ఇదంతా అదానీ కోసమేనా..!!

గిరిజన, దళిత వాడల్లో సాధారణంగా ఎక్కువ సంఖ్యలో గృహాలకు విద్యుత్ మీటర్లు ఉండవు. ఎందుకంటే మనం పేదలం.. మనకు విద్యుత్ ఉచితం.. ఇచ్చిన యూనిట్లు దాటి విద్యుత్ ఖర్చు మనకెందుకుంటదన్నది వారి నమ్మకం. అదే నమ్మకంతోటే ఇన్నేళ్లుగా పేదలంతా ఉచిత విద్యుత్‌ను వాడుకుంటున్నారు. అయితే రెండు నెలలుగా పేదల గృహాలపై విద్యుత్ శాఖ విజిలెన్స్ దాడులు మొదలయ్యాయి. ఫిబ్రవరి 14న విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు నియోజకవర్గం వ్యాప్తంగా పేదల గృహాలపై దాడులు చేశారు. కేసులు పెట్టి జరిమానా కట్టాలంటూ పోలీసులను పంపి బెదిరిస్తున్న పరిస్థితి. అయితే విద్యుత్ శాఖ ఇదంతా అదానీ కోసమే చేస్తోందన్న ఆరోపణలు వస్తున్నాయి. పేదలను సైతం వదలకుండా బలవంతంగా స్మార్ట్ మీటర్లు బిగించి ఉచిత విద్యుత్ పథకానికి ఉరి వేయాలని చూస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే అదానీ స్మార్ట్ కరెంట్ బాదుడుకు పునాదులు పడగా, దాన్ని కూటమి ప్రభుత్వం వడివడిగా ఆచరణలో పెడుతుండటం గమనార్హం. ఇప్పటికే స్థిరాదాయం లేక, కుటుంబ పోషణకు సతమతమవుతున్న పేదల పట్ల విద్యుత్ శాఖధికారులు వ్యవహరిస్తున్న తీరు 'మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా' మారిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

'చలో విజయవాడ' ధర్నాలో గూడూరు మున్సిపల్ కార్మికులు

- పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి
- ఇంజనీరింగ్ కార్మికులకు జీవో నెంబర్ 36 ప్రకారం వేతనాలు ఇవ్వాలని డిమాండ్



ధర్నా చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సి. ఐ.టి.యు) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం విజయవాడ అలంకార్ ధర్నా చౌక్ వద్ద జరిగిన చలో విజయవాడ కార్యక్రమంలో గూడూరు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి, ఇంజనీరింగ్ కార్మికులకు జీవో నెంబర్ 36 ప్రకారం వేతనాలు ఇవ్వాలని ఈ ధర్నాలో వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు మున్సిపల్ నాయకులు కోటేశ్వరరావు, మణి, ప్రసాద్, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఓటేరు చెరువును కాపాడండి

ఓటేరు చెరువు పరిరక్షణకై పోరాటం కొనసాగిస్తాం : సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి



ప్రజాశక్తి - తిరుపతి డెస్క్ : ఓటేరు చెరువును మట్టితో పూడ్చిన భూకబ్జాదారులపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో బుధవారం ఓటేరు చెరువును భూకబ్జాదారులు అక్రమంగా పూడ్చి వేయడంతో పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి హైవే ఆనుకుని ఉన్న 376, 77 సర్వే నెంబర్ ఓటేరు చెరువును అర్ధరాత్రిలో భూకబ్జాదారులు 30 టిప్పర్లతో మట్టితోలి పూడ్చివేశారన్నారు. చెరువును పూడ్చిన వారిపై ఇంతవరకు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోలేదని వాపోయారు. సుమారు 1000 కోట్లకు పైగా విలువ కలిగిన చెరువు భూమిని కాపాడాలని రెండు నెలల క్రితం కలెక్టర్‌ని కలిసి వినతి పత్రం సమర్పించామన్నారు. ఇపుడు దౌర్జన్యంగా భూకబ్జాదారులు చెరువును పూడుస్తూ ఉంటే, ఏ మాత్రం చర్యలు తీసుకోలేదని దుయ్యబట్టారు. ఐదు నెలల క్రితం కుక్లైన్ తో చెరువు నీళ్ల తొలగిస్తే చర్యలు శూన్యమన్నారు. కమ్యూనిస్టులు చెరువును కాపాడాలని పరిశీలనకు వెళితే లాండ్ ఆర్డర్ అతిక్రమణ చేస్తున్నారని పోలీసులు హెచ్చరించే పరిస్థితి ఏర్పడిందిన్నారు. ఓటేరు చెరువు అనుకొని స్థానిక ఎమ్మెల్యే నాని నివాస గృహం ఉన్నా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. బడా నాయకులు భూమిని కాజేయడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. కబ్జాదారుపై చర్యలు తీసుకోకుంటే తిరుపతి రూరల్ తాసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి జల్లా విశ్వనాథ్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, నగర కార్యవర్గ సభ్యులు ఎన్ శివ, శ్రీరాములు, విజయ, అలివేలమ్మ, అల్లా బక్షు, రవి, కిషోర్, శ్రీనివాసులు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 28,591 మంది హాజరు

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: జిల్లాలో జరుగుతున్న ఇంటర్మీడియట్ రెండవ సంవత్సర పబ్లిక్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయని, జిల్లా వ్యాప్తంగా 28,591 మంది విద్యార్థులు హాజరయ్యారని, ఆర్ ఐ ఓ జీ.వి.ప్రభాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి జిల్లా వ్యాప్తంగా 86 జనరల్, 14 వొకేషనల్ కేంద్రాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంగ్లీష్ పేపర్-2 పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు జనరల్ 28,101 మంది, ఒకేషనల్లో 1,030 మంది మొత్తం 29,131 మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉండగా జనరల్లో 510 , ఒకేషనల్లో 30 మంది, మొత్తం 540 మంది పరీక్షకు గైర్హాజరయ్యారని తెలిపారు. పరీక్షా కేంద్రాలలో త్రాగు నీటి వసతి, పోలీసు బందోబస్తు, మెడికల్ క్యాంపు, సీసీ కెమెరాల ఏర్పాటుతో పర్యవేక్షణ, విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు వెళ్లేందుకు వీలుగా బస్సుల సౌకర్యం కల్పించామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఇళ్లను కొల్లగొట్టే ఏడుగురు దొంగలు అరెస్ట్

రూ. 37 లక్షల విలువైన సొత్తు స్వాధీనం



ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: ఇళ్లను కొల్లగొట్టి చోరీలకు పాల్పడి ఏడు మంది దొంగలను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి 37 లక్షలు రూపాయలు విలువ గలిగిన సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమవావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పగలు వీధుల్లో తిరుగుతూ, తాళాలు వేసిన ఇళ్లలో రాత్రిళ్లు చోరీలు చేసేవారిపై ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి నిఘా ఉంచారన్నారు. పోలీసుల నిఘాల్లో తిరుపతి శివ జ్యోతి నగర్‌లోని అయ్యప్ప కాలనీ చెందిన ముత్తాల అరుణ్, డేరంగుల జగదీష్, ముత్తాల తేజస్, తిరుపతి జిల్లా, బాలాయపల్లి మండలం వెంగమాంబపురం గ్రామానికి చెందిన అక్కుర్తి నవీన్, అక్కుర్తి పెంచలయ్య, తిరుపతి రూరల్ మండలం దుర్గ సముద్రం గ్రామానికి చెందిన పూతల విగ్నేష్ రెడ్డి, తిరుపతి రూరల్ మండలం మంగళంలోని బి టి ఆర్ కాలనీకి చెందిన లోకనాథ్ రెడ్డిలు చోరీలకు పాల్పడుతున్నట్లు గుర్తించి, వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి 35 లక్షల విలువగల బంగారం, 1,20,000 విలువగల వెండి నగలు, ఓ కారు, ఓ ఆటో, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ముత్తాల తరుణ్ పై 29 కేసులు, అక్కుర్తి నవీన్‌పై 11 కేసులు, అక్కుర్తి పెంచలయ్యాపై 18 కేసులుఉన్నాయని, వీరి ముగ్గురుపై సస్పెక్ట్ షీట్లు ఉన్నట్లు వెల్లడించారు. వీరిని రిమాండుకు తరలిస్తున్నట్లు తెలిపారు. ముద్దాయిలను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన పోలీసులకు రివార్డులు ప్రకటించారు. ఈ సమావేశంలో ఏఎస్ పి, డిఎస్ పి, సీఐ, ఎస్ ఐ లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాళహస్తీశ్వర ఆలయానికి భక్తులు ఇచ్చిన అంబులెన్స్ మూలన పడిఉన్న వైనం



కునుకు తీస్తున్న కుయ్.. కుయ్..

కోరికలు తీరాలని కొందరు.. అవి తీరిన తర్వాత మరికొందరు.. ఇతరులకు ఉపయోగపడాలని ఇంకొందరు.. శ్రీకాళహస్తీశ్వర ఆలయానికి విరాళాలు అందజేస్తుంటారు. అలా చాలామంది భక్తితో పాటు సామాజిక సేవలో భాగంగా పలువురు దాతలు వస్తు, నగదు, ఇతరత్రా రూపాల్లో విరాళాలు అందజేశారు, అందజేస్తున్నారు. అయితే అటువంటి దాతల పట్ల దేవస్థానం అధికారులు ఏ మాత్రం గౌరవ మర్యాదలు లేకుండా వ్యవహరిస్తున్నారు. దాతలిచ్చిన బహూమానాలపై చిన్న చూపు చూస్తున్నారు. విరాళాలుగా వచ్చిన వాటిని మూలన పడేస్తున్నారు. ఇందుకు దేవాలయినికిచ్చిన అంబులెన్స్ ఒక ఉదాహరణ.

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : హైదరాబాద్‌కు చెందిన విభా సీడ్స్ యాజమాన్యం ఆలయానికి అంబులెన్స్ విరాళంగా అందజేసింది. దీని వల్ల ఎంతో మందికి అత్యవసర సేవలు అంది ప్రాణాలు కాపాడుకున్నారు. అలాంటి అంబులెన్స్ మరమ్మతుకు గురైతే నిర్లక్ష్యంగా మూలన పడేశారు. సన్నిధి వీధిలోని శివసదన్ అతిథి గృహం చెట్టు కింద అంబులెన్స్ విశ్రాంతి తీసుకుంటోంది. వాహనానికి మరమ్మతులు చేస్తే ఆలయానికి వచ్చే భక్తులకు ఉపయోగపడుతుంది. లేదా పట్టణ ప్రజలకు కూడా ఉపయోగపడుతుంది. నిర్వహణ భారం ఎక్కువగా ఉంటే స్థానిక ఏరియా ఆసుపత్రికి అప్పగించాలన్న డిమాండ్ కూడా ఉంది. లేదా స్వచ్ఛంద సంస్థలకు అప్పగిస్తే వారి నిర్వహణలో ఉంటుంది. అధికారులకు అలాంటి ఆలోచన రాలేదు. మరమతులకు గురైన వాహనాన్ని మూలన పడేసి మరో వాహనాన్ని వినియోగిస్తున్నారు. అంబులెన్స్‌ను విరాళంగా ఇచ్చిన దాతకు సమాచారం అందించినా వారు మరమ్మతు చేయించే అవకాశం ఉంది. అధికారులు ఆ ప్రయత్నం కూడా చేయలేదు. ఫలితంగా లక్షల రూపాయలతో కొనుగోలు చేసిన వాహనం నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా ఆలయాధికారులు స్పందించి వాహనానికి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు.

రేపు రైతులకు అవగాహనా సదస్సు


ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: మామిడిలో పూత, పిందె సమయంలో వచ్చే చీడపీడలపై రైతులకు యర్రావారిపాలెం మండలంలోని సిద్దేశ్వర రైతు సంఘం కలెక్షన్ సెంటర్ లో ఈనెల ఏడవతేది శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు అవగాహనా సదస్సు నిర్వహించనున్నట్లు చిన్నగొట్టిగల్లు మండల ఉద్యానశాఖాధికారిణి శివకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిన్న గొట్టిగల్లు, ఎర్రావారి పాలెం మండలాల మామిడి రైతులు పాల్గొనాలని కోరారు. ప్రతి మామిడి రైతు తప్పని సరిగా హాజరై మామిడిపై అవగాహన పెంచుకోవాలని కోరారు.


లైన్ మ్యాన్‌లకు సర్టిఫికెట్లు అందిస్తున్న విద్యుత్ సూపరింటెండెంట్ సురేంద్రనాయుడు

ఘనంగా జాతీయ లైన్ మ్యాన్ దినోత్సవం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు విద్యుత్ డివిజనల్ కార్యాలయంలో జాతీయ లైన్ మ్యాన్ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తిరుపతి డివిజన్ విద్యుత్ సూపరింటెండెంట్ సురేంద్రనాయుడు మాట్లాడుతూ ప్రతి ఏటా మార్చిలో జాతీయ లైన్ మ్యాన్ దినోత్సవం నిర్వహించేందుకు అనుమతిచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యుత్ లైన్ మ్యాన్‌లు కీలకమైన వ్యక్తులని కొని యాడారు. వారికి ముందస్తు జాగ్రత్తలు, సూచనలు అందించారు. సమాజానికి విద్యుత్ కోతలు లేకుండా నిర్వహించడంలో లైన్ మ్యాన్ పాత్ర చాలా కీలకమన్నారు. ప్రతిభ చూపిన లైన్ మ్యాన్‌లు అందరికీ సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఈఈలు దేవాశీర్వాదం, బాలాజీ, ఏడిఈలు శంకరయ్య, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

టిడ్కో కాలనీకి సౌకర్యాలు కల్పించండి



వినతిపత్రం ఇస్తున్న టిడ్కో కాలనీ వాసులు

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: తమ ఇళ్లకు ఎలాంటి సౌకర్యాలు గతంలో కల్పించ లేదని వెంటనే సమస్య లు పరిష్క రించాలని ఏర్పేడు మండలం, వికృత మాల పంచాయతీ టిడ్కో కాలనీ వాసులు జనసేన ఇన్‌ఛార్జి వినుతకు బుధవారం వినతిపత్రం అందించారు. టిడ్కో ఇళ్ల వాసులు జనసేన ఇన్‌ఛార్జి వినుత కోటను రేణిగుంటలో కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో ఏడు బోర్లు వుండగా కనీసం 2 కూడా పని చెయ్యడం లేదని, బస్ సౌకర్యం లేక స్కూలు పిల్లలు ఐదు కిలోమీటర్లు నడిచి వెళుతున్నారని, రేషన్ సరిగా ఇవ్వడం లేదని, కొంత మందికి పింఛన్లు ఇవ్వడం లేదని తెలిపారు. డ్రైనేజీలు లేవని తెలిపారు. స్పందించిన వినుత ఈ సమస్యలు టిడ్కో ఛైర్మన్ వేముల పాటి అజయ్ కుమార్, తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, తిరుపతి మున్సిపల్ కమిషనర్ మౌర్యల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

చెర్లోపల్లి సర్పంచ్‌కి ఉత్తమ పురస్కారం


పురస్కారం స్వీకరిస్తున్న సర్పంచ్ సుభాషిణి

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: చెర్లోపల్లి పంచాయతీ సర్పంచ్ సుభాషిణికి కేంద్ర ప్రభుత్వం ఉత్తమ పురస్కారం ప్రదానం చేసింది. ఢిల్లీలో పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి రాజీవ్జన్ సింగ్ (లలన్సింగ్) నుంచి ఉత్తమ పురస్కారం అందుకున్నారు. పంచాయతీలోని వనరులను సద్వినియోగం చేసుకుని, ఆర్థికాభివృద్ధికి కృషిచేసినందుకు ఈ పురస్కారం ప్రదానం చేశారని తెలిపారు. సహకరించిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు, కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

నిత్యావసర సరుకులు పంపిణీ


నిత్యావసర సరుకులు అందిస్తున్న దాతలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : కళ్యాణవీరభద్ర స్వామి ఆలయం లో రెడ్ సంస్థ ఆధ్వర్యం లో ఇన్నర్ వీల్, ఆంధ్ర మహిళా మండలి సహకారంతో 37 మంది పేద వికలాంగులకు నిత్యావసర వస్తువులు బుధవారం పంపిణీ చేశారు. మన్నారపు ఉష , దేగ సుప్రియ ఐదు వేల రూపాయలు అందించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ రోహిణమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర మహిళా మండలి కార్యదర్శి విష్ణు వందన , ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు తనూజ కార్యదర్శి అనితా ,సభ్యులు స్నేహలత, లక్ష్మీ రెడ్ సంస్థ సభ్యులు జానా సుధీర్, కోడిపర్తి శ్రీధర్ ,పల్లం వెంకటేశ్వర్లు, మెదురు శ్రీనివాస ఆచారి పాల్గొన్నారు.

మార్కెట్లోకి 'టొయోటా లెజెండర్ ఎంటీ' విడుదల



ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: అధిక పనితీరు, సాహ సోపేతమైన, స్టైలిష్ ఎస్ యు విలకు పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చటానికి, టొయోటా కిర్లోస్కర్ మోటర్ (టీకెఎం) టొయోటా లెజెండర్ 4ఇంటు4 మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ (ఎంటీ) వేరియంట్‌ను ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా సేల్స్-సర్వీస్-యూజ్డ్ కార్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ వరీందర్ వాధ్వా థ్రిల్ కోరుకునే డ్రైవింగ్ ప్రేమికుల కోసం రూపొందించామని ఈ కొత్త వేరియంట్, శక్తి, లగ్జరీ, అత్యాధునిక సాంకేతికత పరిపూర్ణ సమ్మేళనాన్ని అందిస్తుందన్నారు. లెజెండర్, 2021లో అధునాతన 4ఇంటు4 సామర్థ్యాలతో భారతదేశంలోకి అడుగుపెట్టింది. లెజెండర్ 4ఇంటు4 ఎంటీలో 2.8ఎల్ డీజిల్ ఇంజిన్ వుంది. ఇది 204 పిఎస్ పవర్, 420ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుందని, 6-స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ ఖచ్చితత్వాన్ని పెంచుతుంది, టొయోటా అధునాతన 4ఇంటు4 టెక్నాలజీ డ్రైవర్లకు విభిన్న ఆఫ్-రోడ్ ఎస్కేప్‌లకు ఆదర్శవంతమైన సహచరుడిగా చేస్తుందని తెలిపారు. లెజెండర్ 4ఇంటు4 ఎంటీ కోసం బుకింగ్‌లు ఇప్పుడు తెరిచి ఉన్నాయి. కస్టమర్లు తమ సమీప టొయోటా డీలర్‌షిప్‌ను సందర్శించవచ్చు, టొయోటా భారత్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చని సూచించారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రసవానికి అవస్థలు పడుతున్నారు..

- 24 గంటలూ వైద్యులు అందుబాటులో ఉండాలి - ప్రభుత్వ ఆసుపత్రుల తీరుపై అసెంబ్లీలో ఎమ్మెల్యే ఆదిమూలం


శాసనసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

ప్రజాశక్తి - నాగలాపురం: సత్యవేడు నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో ఉన్న ఒక సిహెచ్‌సి, ఏడు పీహెచ్‌సిలలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అసెంబ్లీలో ప్రస్తావించారు. ముఖ్యమంత్రి గర్భిణులు ప్రసవానికి వైద్యం కోసం అవస్థలు పడుతున్నారని, వైద్యులు 24 గంటలూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏపీ అసెంబ్లీలో ఎమ్మెల్యే బుధవారం మాట్లా డుతూ తమది ఎస్‌సి రిజర్వుడ్ నియోజకవర్గం అని, తమిళనాడు సరిహద్దులోని వెనుకబడిన ప్రాంతమై నందున నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్యుల కొరత తీవ్రంగా ఉందన్నారు. ఈ కారణంగా ప్రత్యేకంగా రాత్రి వేళల్లో ప్రసవాలు, రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటే వైద్యులు అందుబాటులో లేకపోవడం వల్ల ప్రసవానికి వచ్చే గర్భిణులు, వైద్యకోసం వచ్చే క్షతగాత్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సభలో ఎమ్మెల్యే వాపోయారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవ సమయంలో ఆపరేషన్ చేయాల్సి వస్తే అందుకు అవసరమైన గైనిక్ వైద్య నిపుణులు లేని కారణంగా సుమారు వంద కిలోమీటర్లు ఉన్న తిరుపతి ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేస్తున్నారన్నారు.అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో అంత దూరం ప్రయాణం చేయడం వల్ల తల్లి, బిడ్డ ప్రాణాలకు గ్యారంటీ లేకుండా పోతోందని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ ఆస్పత్రులలో ప్రసవ ఆపరేషన్‌కు కనీసం ఒక లక్ష రూపాయలు తీసుకుంటున్నారన్నారు. అంత మొత్తం పేద ప్రజలు పెట్టుకోలేక ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారని, సభాధ్యక్షులు సమస్య తీవ్రతను గుర్తించి తన నియోజకవర్గ కేంద్రంలో ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఏరియా ఆసుపత్రి స్థాయికి పెంచాలని, గైనిక్ డాక్టర్‌ను ఆస్పత్రిలో నియమించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ సమస్యను ఇప్పటికే ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లామని, వినతి పత్రం సమర్పించామని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు , మంత్రి లోకేష్ తమ నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆసు పత్రు లపై దృష్టి సారించి, ప్రజలను ఆదుకోవాలని ఎమ్మెల్యే కోరారు. స్పందించిన సభాధ్యక్షులు ఆర్ఆర్ఆర్ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యప్రసాద్‌కు సమస్యను చేరవేస్తా మని సమాధానం ఇచ్చారు.

ఇళ్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తుల ఆహ్వానం


మాట్లాడుతున్న తహశీల్దారు భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి అర్బన్ తహశీల్దారు పరిధిలోని 2019కి ముందు వివాద రహిత భూముల్లో నిర్మించుకున్న ఇళ్ల క్రమ బద్ధీకరణకు గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసు కోవాలని తహశీల్దారు భాగ్యలక్ష్మి తెలిపారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆర్సీసీ పైకప్పు ఉండి ఇటుకల గోడతో నివాసయోగ్య నిర్మాణమై వుండాలన్నారు. దరఖాస్తులను అధికారుల కమిటీ పరిశీలించి క్రమ బద్ధీకరణకు అనుమతి ఇస్తుందన్నారు. స్లాబ్ మేరకు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలన్నారు. అరులు డిసెంబరు 31వ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇళ్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం చర్యలు తీసుకోనుందని తహశీల్దారు పేర్కొన్నారు. ఇంటి పన్ను రసీదు, విద్యుత్ బిల్లు, నీటి పన్ను లాంటి ఆధారాలతో సచివాలయ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివాదాల్లో లేని భూములై ఉండాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహశీల్దారు రామచంద్రయ్య, ఆర్ఐ జి కృష్ణమ్మ పాల్గొన్నారు.

ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలు


సలహాలు, సూచనలు అందిస్తున్న ఐసిడిఎస్ అధికారులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్:.అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాల లో భాగంగా ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం పుత్తూరులో 'మై హెల్తీ ప్లేట్, చిరు ధాన్యాల ప్రాముఖ్యత పై అంగన్‌వాడీ కార్యకర్తలకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టాటా ట్రస్ట్ కోఆర్డినేటర్ సంతోషి, అంగన్‌వాడీ కార్యకర్తలకు బ్యాలెన్స్ డైట్ గురించి వివరించారు. సూపరువైజరు సంధ్య మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు అందరూ లబ్ధిదారులకు బ్యాలెన్స్ డైట్, చిరుధాన్యాలు వినియోగం పై అవగాహన కలిగించి వాటిని వాడేలా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'శ్రీ గాయత్రీ'లో ఏఆర్ ల్యాబ్ ప్రారంభం


శ్రీగాయత్రి స్కూలులో ఏఆర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూలులో ఆగ్మెంటెడ్ రియాలిటీ అండ్ వర్చువల్ రియాలిటీ ల్యాబ్‌ని డెల్టా జనరల్ మేనేజర్ ఇంద్రాణి , మేనేజింగ్ డైరెక్టర్ రాజు, కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి , అకడమిక్ డీన్ శ్రీహరి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి మాట్లాడుతూ ఏ ఆర్ ల్యాబ్ లో విద్యార్థులకి గణితం, సైన్స్‌లకు హోలో క్యూబ్స్ ద్వారా కష్టమైన అంశాలు ఆసక్తి కరంగా, సులభంగా నేర్చుకునే అవకాశం వుందన్నారు. ప్రస్తుతం ఉన్న ఆర్టిఫిషియ ఎల్ ఇంటెలిజెన్స్ యుగంలో విద్యార్థులకు టెక్నాలజీ పరమైన బోధన ఎంత అవసరం అని, అందుకే శ్రీ గాయత్రి స్కూల్ లో ఈ ఏ ఆర్ ల్యాబ్‌ను ప్రారంభించామని తెలిపారు . ఈ కార్యక్రమంలో డెల్టా ప్రతినిధులు ఆంజనేయులు, ఇమ్రాన్, ఉపాధ్యాయులు రఫీ, మస్తాన్ బీ, సుప్రజ, హరిత, శిరీష, నసీర, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు కార్పొరేషన్ల రాయితీ రుణాలకు ఇంటర్వ్యూలు


శేఖర్, ఇన్‌ఛార్జి ఎంపిడివో

ప్రజాశక్తి -రామచంద్రపురం(చంద్రగిరి): చంద్రగిరి మండలానికి కేటాయించిన వివిధ కార్పొరేషన్ల రాయితీ రుణాలకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో ఏ శేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు . శుక్రవారం ఉదయం 10 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బ్యాంకర్స్, ఇంటర్వ్యూలు నిర్వహించనునట్లు తెలిపారు. చంద్రగిరి మండలానికి కేటాయించిన బిసి, కాపు, కమ్మ, రెడ్డి, వైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ కార్పొరేషన్లకు సంబంధించిన రాయితీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు కులం, ఆదాయం, విద్యార్హత ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు.

విద్యార్థుల అభివృద్ధికి సమిష్టి కృషి: ప్రిన్సిపాల్



మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : విద్యార్థుల అభివృద్ధి కోసం ఉపాధ్యాయులు, వారి తల్లిదండ్రులు కలిసికట్టుగా కృషి చేయాలని ప్రిన్సిపాల్ డాక్టర్ బి చంద్రమౌళి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పేరెంట్స్, టీచర్స్ సమావేశం బుధవారం నిర్వహించారు. అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు రెగ్యులర్‌గా కళాశాలకు వచ్చి హాజరు శాతం 75 శాతం ఉంటేనే పరీక్షలకు అనుమ తిస్తారన్నారు. విద్యార్థుల హాజరు శాతం 75 శాతం ఉంటేనే ప్రభుత్వం కూడా ఫీజు రీయింబర్సుమెంటు ఇస్తుందని తల్లిదండ్రులు పిల్లల చదువు పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. కళాశాలలో అన్ని రకాల సైన్స్ ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్ సౌకర్యాలు ఉన్నాయని, అనుభవం, ఉన్నత విద్యార్హతలు కలిగిన అధ్యాపకులు ఉన్నారని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల లో ఏమైనా లోటుపాట్లు ఉంటే తెలిపితే వాటిని సరి చేసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వి వీరయ్య, డాక్టర్ పి సుజనా, టి నరసింహులు, డాక్టర్ ఆర్ బి వాణిశ్రీ, డాక్టర్ పూజారి వెంకటేశన్, అర్జా నాగేశ్వర్ రావు, తదితర అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జగన్ తీరు మారాలి: టిడిపి


మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత జగన్ తన వ్యవహార తీరును మార్చుకోవాలని టిడిపి బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎం ఉమేష్ రావు హితవు పలికారు. బుధవారం ఆయన బీసీ నేతలతో కలిసి మీడియాతో మాట్లాడుతూ శాసనసభ చట్టాల ప్రకారం జగన్‌కు ప్రతిపక్ష హోదా రాదని స్పష్టమవుతున్నా జగన్ మొండిగా వెంపర్లాడడం, చంద్రబాబుపై దుమ్మెత్తి పోయడం ఆయన అవివేకానికి నిదర్శనం అన్నారు. ఐదేళ్ల హింసా పాలన చేసి, నేడు నీతులు చెప్పడం జగన్ కే చెల్లిందని మండిపడ్డారు. మిన్నల్ రవి, నెమళ్లూరు బుజ్జి పాల్గొన్నారు.

ఉపాధి కార్మికుల సమస్యలు పట్టని ప్రభుత్వాలు: సిఐటియు


ఉపాధి కూలీల సమస్యలు తెలుసుకుంటున్న సిఐటియు నాయకులు శివకవి ముకుంద

ప్రజాశక్తి-నాయుడుపేట: నాయుడుపేట మండలం లోని చిగురుపాడు గ్రామానికి చెందిన ఉపాధి హామీ కార్మికుల సమస్యలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పట్టడంలేదని సిఐటియు నాయకులు శివకవి ముకుంద పేర్కొన్నారు. చిరుపాడు గ్రామ ఉపాధి హామీ పనులు చేస్తున్న ప్రదేశానికి శివకముకుంద బుధవారం వెళ్లి కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. పనిచేసే చోట వారికి తాగటానికి నీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. గడ్డపార, గంపగుణం, కత్తులు, పారలు వాటికి పట్టించే సాన వీళ్లకి ఇచ్చే ఆ కొద్దిపాటి కూలి డబ్బుల్లోనే ఖర్చు పెట్టాల్సి వస్తోందన్నారు. ఏడు వారాల నుండి ఆ కూలి డబ్బులు కూడా రాకపోవడంతో పదును లేని పని ముట్లతోనే ఇబ్బందులు పడుతున్నారని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ఉపాధి హామీని ఎత్తేయడానికి చేస్తున్న పన్నాగాలన్నారు. 2007లో అమలైన గ్రామీణ హామీ పని ఆ రోజు ఉపాధి హామీ కూలీలకు మంచినీటి కోసం చిన్న బిడ్డలను ఆడించుకునేందుకు మనిషిని ఏర్పాటు చేసేవారన్నారు. గడ్డపార, పార, గంప బాడుగలు చెల్లించేవారని, మేటీలకు సైకిల్ టేపు ఏర్పాటు చేసేవారని, మెడికల్ కిట్టు, విశ్రాంతికి పట్టా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసేవారన్నారు. ఇప్పుడు అవి ఏవీ లేకుండా చేశారని ఉపాధి హామీ పనిని పూర్తిగా తొలగించడానికి పొమ్మనకక పొగబెట్టడం అన్న సామెత లాగా కార్మికులు వారంత వారు వెళ్లిపోయే విధానాలు చేపడుతున్నారన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ కార్మికులను గుర్తించి వారికి రావాల్సిన కూలీలు వారికి కావలసిన పరికరాలు ఏర్పాటు చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేపడుతామని హెచ్చరించారు.

ప్రతి జిల్లాలో మోడ్రన్ ధోబి ఘాట్‌లు: సావిత్రి



మాట్లాడుతున్న రజక డెవలప్‌మెంటు కార్పొరేషన్ ఛైర్ పర్సన్ సావిత్రి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో మోడ్రన్ ధోబి ఘాట్లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని రాష్ట్ర రజక డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్ పర్సన్ సావిత్రి తెలిపారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మోడ్రన్ దోబీగాట్ల ఏర్పాటు, ఇప్పటికే ఉన్న దోబీగాట్ల వాస్తవ పరిస్థితులను గమనించడానికి రాష్ట్ర వ్యాప్త పర్యటన చేస్తున్నామన్నారు. అందులో భాగంగా తిరుపతి జిల్లాలో రజకులు ఉపాధి అవకాశాలు పొందడానికి అత్యధిక అవకాశాలు ఉన్నాయన్నారు. 1976 నుండి ఇప్పటివరకు 54 ధోబిగాట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉన్నట్లుగా గుర్తించామన్నారు. దాదాపు వీటిల్లో 70 శాతంకు పైగా దోబీ ఘాట్లు దెబ్బతిని ఉన్నాయన్నారు. వీటి మరమ్మతుల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన మేరకు దోబీ ఘాట్లు లేవని, ఎంపిక చేయబడ్డ గ్రామాలలో దోబీగాట్ల ఏర్పాటు చేస్తామన్నారు. తిరుపతి నియోజకవర్గ పరిధిలోని దాదాపు 40 వేల మందికిపైగా రజకులు ఉన్నారని, రజకుల కుటుంబీకులలో ఉపాధి అవకాశాలు పొందాలంటే చదువుకున్న వారు కూడా మోడ్రన్ ధోబి గాట్ల వల్ల ఉపాధి పొందవచ్చన్నారు. 250 యూనిట్ల ఉచిత విద్యుత్తును అందివ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించనున్నామన్నారు. ఈ సమావేశంలో రజక కార్పొరేషన్ డైరెక్టర్ కరాటే చంద్ర, రజక జనసేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అక్కినపల్లి లక్ష్మయ్య, గంధం బాబు, గంధం వెంకటముని, రాజయ్య, మధు, దినేష్ పాల్గొన్నారు.

సీఏ ఫలితాల్లో 'ఎమరాల్డ్స్' ప్రతిభ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగర పరిధిలోని నరసింహ తీర్థం రోడ్డు మార్గంలోని ఎమరాల్డ్స్ సిఏ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు బుధవారం న్యూఢిల్లీ సిఏ ఇన్స్ టిట్యూట్ వారు విడుదల చేసిన ఫలితాలలో ఉత్తమ ప్రతిమ కనబరిచారని ఎమరాల్డ్స్ డైరెక్టర్లు ఇ గిరిధర్, కె విశ్వనాథ్ తెలిపారు. ఈ ఫలితాల్లో సీఏ ఇంటర్ కోర్సులో సాయి ప్రమోద్ 321, మనోజ్ 320 మార్కులతో టాపర్లుగా నిలిచి 59.37 శాతం ఉత్తీర్ణత సాధించా రన్నారు. ఫౌండేషన్ కోర్సులో ఎస్ఐ నందిని, డి పల్లవి, డి మీన, పి చందన ప్రియ, కె రిషిత టాపర్లుగా నిలిచారన్నారు. ఈ పలితాల్లో ఎమరాల్డ్స్ విద్యార్థులు 68.76 శాతం ఉత్తీర్ణత సాధిం చడం సంతోషంగా ఉందన్నారు. ఈ ఫలితాలు సాధించిన విద్యార్థులు, అధ్యాపక బృందాన్ని డైరెక్టర్లు ప్రత్యేకంగా అభి నందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న ఎమరాల్డ్స్ డైరెక్టర్లు ఇ గిరిధర్, కె విశ్వనాథ్

డాక్టర్ శర్మిష్టారాయ్‌కు 'జనరల్ సర్జరీ మాస్టర్' పట్టా



జనరల్ సర్జరీ మాస్టర్ పట్టా అందుకుంటున్న శర్మిష్టారాయ్

ప్రజాశక్తి -రామచంద్రపురం(చంద్రగిరి): ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన మౌలానా ఆజాద్ మెడికల్ కళాశాలలో బుధవారం సాయంత్రం స్నాతకోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి కి చెందిన డాక్టర్ డొక్కా శర్మిష్టారాయ్, సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ చేతులు మీదుగా జనరల్ సర్జరీ మాస్టర్ పట్టా అందుకున్నారు. 2020 వ సంవత్సరం పిజీ మెడికల్ నీట్‌లో రాష్ట్ర స్థాయిలో 108వ ర్యాంక్ సాధించి, ఢిల్లీ యూనివర్సిటీ లో జనరల్ సర్జరీలో సీటు పొందాడు. ప్రస్తుతం జనరల్ సర్జరీ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించి బుధవారం పట్టా పొందారు. వీరి తండ్రి డొక్కా చిన గంగయ్య చంద్రగిరి మండలంలో వెలుగు ప్రాజెక్ట్ లో ఏపియం, తల్లి యస్వీ యూనివర్సిటీ లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. భవిష్యత్‌లో సూపర్ స్పెషాలిటీ చేసి, పేదరోగులకు సేవ చేయాలనేది తన ఆకాంక్ష అని ఆమె తెలిపారు.

మహిళల అభివృద్ధే లక్ష్యం: పులివర్తి సుధారెడ్డి

ప్రజాశక్తి -రామచంద్రపురం (పాకాల): రాష్ట్రంలోని మహిళల సంక్షేమం, ఆర్థికాభివృద్దే కూటమి ప్రభుత్వం లక్ష్యమని టిడిపి మహిళా నేత పులివర్తి సుధా రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వల్లివేడు, ఈ-పాలగుట్టపల్లి, గుండ్లగుట్టపల్లి పంచాయతీలోని మహిళలతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గంలో మహిళలు మహిళ సాధికారత సాధించడం కోసం ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. డ్వాక్రా మహిళలు పొదుపు సంఘాల ద్వారా ఎంత మేరకు రుణాలు తీసుకున్నారు? ఎలాంటి యూనిట్లు ఏర్పాటు చేశారనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ముందు చూపుతో మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం విజన్ 2047ను రూపొందిస్తోందన్నారు. సూపర్ సిక్స్ హామీలలో భాగంగా మహిళలకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, మహిళల పేరిట ఇంటి పట్టాలు, పక్కా గృహాలు ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. చంద్రగిరి నియోజక వర్గంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మహిళలకు ఉచిత టైలరింగ్ , స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో ఉద్యోగాలు, మరెన్నో గొప్ప అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. అనంతరం పంచాయతీలలోని డ్రైనేజ్, వాటర్ ట్యాంక్, ఇంటి పట్టాలు, సీసీ రోడ్, కమ్యూనిటీ హాల్, ఇతర సమస్యలను మహిళా నేత పులివర్తి సుధా రెడ్డి దృష్టికి తీసుకురావడంతో త్వరలో ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని మహిళలకు హామీ ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి నంగా పద్మజా రెడ్డి కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

చెరువులో మహిళ మృతదేహం లభ్యం


గుర్తు తెలియని మహిళ మృతదేహం

ప్రజాశక్తి-తడ: గుర్తు తెలియని మహిళ మృత దేహాన్ని తడ మండలంలోని మాంబట్టు గ్రామం చెరువులో స్థానికులు బుధవారం కనుగొన్నారు. మాంబట్టు గ్రామం అపాచీకి వెళ్లే రోడ్డు పక్కన వున్న చెరువు నీటి లో మృతదేహం తేలుతూ దుర్వాసన వస్తుండడాన్ని స్థానిక పందుల పెంపకం దారుడు గుర్తించి పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని బయటకు తీశారు. మృతదేహం పురుగులు పట్టి దుర్వాసన వస్తోందని, సుమారు నాలుగు, ఐదు రోజులుగా చెరువు నీటిలో మృతదేహం వున్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు. ఈ మృతదేహాన్ని స్థానిక పందుల పెంపకం దారుడు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతదేహం పై వంగపూత రంగు దుస్తులు వున్నాయని, ఎలాంటి మిస్సింగ్ కేసు తమ వద్ద నమోదు కాలేదని పోలీసులు తెలిపారు. పరిసర గ్రామాలవారూ మృతదేహం ఎవరిదో గుర్తించలేకపోతున్నారన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

స్కూటర్‌ను ఢీకొన్న ట్రాక్టర్

విద్యార్థి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ట్రాక్టరు స్కూటర్‌ను ఢీకొన్న ప్రమాదంలో విద్యార్థి మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన సంఘటన పుత్తూరు- చెన్నై జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. నేషనల్ పంచాయతీ గట్టుకు చెందిన విద్యార్థులు రవి శేఖర్ (17), ముని కుమార్(19) అన్నతమ్ముళ్లు.. వీరిద్దరూ ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం ఉదయం కళాశాలకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా పుత్తూరు- చెన్నై జాతీయ రహదారి గోవింద పాళ్యం బైపాస్ రోడ్డు వద్ద ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో స్కూటరుపై వెళుతున్న తమ్ముడు రవిశేఖర్ మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేశారు. మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతి ఆస్పత్రికి తరలించారు. తమ కుమారుడు మృతి చెందడంతో విద్యార్థి తల్లిదండ్రులు బోరుమని విలపిస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు బంధువులకు అప్పగించారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టరు డ్రైవరును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాత కక్షలతో ఆటో డ్రైవర్‌పై దాడి

ప్రజాశక్తి-నాయుడుపేట: నాయుడుపేట మండలం పుదురు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ చెంచయ్యపై అదే గ్రామానికి చెందిన కొంతమంది పాత కక్షలతో విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన బుధవారం సాయంత్రం ఆయనపై చోటుచేసుకుంది. బాధితుడి కుటుంబ సభ్యుల కథనం మేరకు పూదురు గ్రామానికి చెందిన బొమ్మిడి చెంచయ్య నాయుడుపేట పుదూరు మధ్య ఎన్నో సంవత్సరాలుగా ఆటో నడుపుతున్నాడు. పూదురు నుంచి నాయుడుపేటకు ఆటో నడుపుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల కొంతమంది పూదురు అరుందతీయ వాడకు చెందిన యువకులు వారి సొంత కార్యక్రమాల కోసం రాత్రి సమయంలో చెంచయ్య ను ఆటో కావాలని అడిగారని, వారు మద్యం మత్తులో ఉండటంతో అయన నిరాకరించడంతో వారి మధ్య కొంత సమయం వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో ఆగ్రహించిన యువకులు మధ్యాహ్నం పూదురు అరుందతీయవాడ వద్ద ఆటోలో ఉన్న చెంచయ్యపై ఆ యువకులు మూకుమ్మడిగా దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడని తెలిపారు. తీవ్రంగా గాయపడిన చెంచయ్యను నాయుడుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోలీసులకు ఫిర్యాదు చేశామనితెలిపారు.


పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న దాతలు

దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో బాలాజీ నగర్ లోని ఆ సంస్థ కార్యా లయంలో వేదాంతం విజయ సారధి మహాలక్ష్మి జ్ఞాప కార్థం వారి పెళ్లి రోజు సందర్భంగా వారి మనుమడు వేదాంతం విష్ణువర్ధన్ సహకారంతో 50 మంది నిరుపేద మహిళలకు బుధవారం చీరలు, వెజిటబుల్ బిర్యానీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ రఘునాథ చక్రవర్తి రాధా దంపతుల కుమారుడు విష్ణువర్ధన్ వాళ్ల నాన్నమ్మ తాతయ్య జ్ఞాపకార్థం మంచి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతి కుటుంబ సభ్యులు వాకాటి రామ్మోహనరావు, పిల్లిల్ల శ్రీనివాసులు, వాచ్ షాప్ రాము, శ్యామ్, కోట వెంకటేశ్వర్లు, గోల్డ్ షాప్ మల్లికార్జున, తూపిలి యశ్వంత్, డిష్ నాగరాజు, సంచుమని ప్రసాద్, కృష్ణారెడ్డి, విజయ్ శ్రావణ్, నాగేంద్ర నయమద్దుల పాల్గొన్నారు.

వెండి చీరలో శ్రీ రాజ రాజేశ్వరిదేవి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని సత్రపు వీధిలో ఉన్న శ్రీ రాజరాజేశ్వరి ఆలయంలో పదవ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారు వెండి చీరలో భక్తులకు దర్శనమిచ్చారు. గణపతి పూజ, దుర్గ త్రిశతి, హో మం , పూర్ణా హుతి అన్న దానం నిర్వ హిం చారు. భక్తు లు అమ్మ వారిని దర్శించి పూజా కార్యక్ర మాల్లో పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు.